ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 3
సోమవారం 1 ఏప్రిల్ 2024
జిల్లాల వార్తలు



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.35 గం.
సహర్ : మంగళవారం ఉ:4.48 గం.



సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి దామోదర్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు, తదితరులు

జహీరాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- హాజరైన మంత్రి దామోదర్, అభ్యర్థి సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు

నారాయణఖేడ్, మార్చి 31: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఇన్‌చార్జిలతో సీఎం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రచారం, విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సమీక్షలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, అభ్యర్థి సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నిర్మలాజగ్గారెడ్డి, కైలాస శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మెదక్ సీఎస్ఐ చర్చిలో శిలువ ఆరాధన నిర్వహిస్తున్న మతపెద్దలు



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

ఏసు పునరుత్థానం.. జగత్తుకు శుభారంభం

- మెదక్ చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం
- భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు
- గీతాలాపనతో వెల్లువిరిసిన ఆధ్యాత్మికత

మెదక్ కల్చరల్, మార్చి 31 : ఏసు సిలువ యాగం విషాదంతో సమాప్తమైతే, పునరుత్థానంతో జగత్తుకు శుభారంభం జరిగిందని మెదక్ సీఎస్ఐ చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం అందించారు. ఆదివారం ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున శిలువ ఆరాధన నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం వినిపిస్తూ.. లోకంలోని పాపులందరిని రక్షించడానికి ఏసు మళ్లీ తిరిగి వచ్చారన్నారు. తన రక్తప్రోక్షణతో మానవాళికి విముక్తి కల్పించారని తెలిపారు. సిలువలో, ఖాళీ సమాధిలో అంకురార్పణ జరిగిన దేవుడి క్షమారాజ్యం రెండువేల ఏళ్లుగా ప్రపంచమంతా విస్తరిస్తూనే ఉందన్నారు. ఈస్టర్ ప్రార్థనలకు జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. మహిళలు చర్చి శిలువ ప్రాంగణంలో కొవ్వొత్తులను వెలిగించి ఏసయ్యను వేడుకున్నారు. చర్చిలో ఆలపించిన ప్రత్యేక గీతాలతో భక్తులు ఆధ్యాత్మికతలో మైమరిచిపోయారు. ఈ ప్రార్థనల్లో డేవిడ్ రిచర్డ్ శ్రీనివాస్, సువర్ణ, మతపెద్దలు, చర్చి కమిటీ సభ్యులు సంపత్, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళలు



రక్త నిల్వలు ఖాళీ

- నెగిటివ్ గ్రూపుల రక్తానికి తీవ్ర కొరత
- పాజిటివ్ గ్రూపుల రక్త నిల్వలు తక్కువే
- సంగారెడ్డి జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌లో అందుబాటులో 58 యూనిట్లే
- రక్తదాతలు ముందుకొస్తేనే ఉపశమనం
- అపోహలు వీడి రక్తదానం చేయాలంటున్న వైద్యాధికారులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 31 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వల కొరత ఏర్పడుతున్నది. వేసవిలో ఏర్పడే ఈ రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు దాతల సహకారం అవసరం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఉచితంగా రక్తం కావాలంటే ఇతరుల నుంచి సేకరించి ఇవ్వాల్సి వస్తున్నది. నారాయణఖేడ్, జహీరాబాద్ ఏరియా ఆస్పత్రుల్లో బ్లడ్ స్టోరేజీ సెంటర్లున్నా.. అక్కడికి సంగారెడ్డి జీజీహెచ్ నుంచే రక్తం యూనిట్లను సరఫరా చేయాల్సి రావడంతో రక్త నిల్వల సమస్య మరింత పెరుగుతున్నది. ఫలితంగా ప్రమాద ఘంటికలు మోగే పరిస్థితులున్నాయి.

జిల్లా కేంద్రమైన జీజీహెచ్ బ్లడ్‌బ్యాంకులో అన్ని రకాల గ్రూపులకు సంబంధించిన రక్తం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండట్లేదు. వేసవిలో అయితే ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా నెగిటివ్ గ్రూపులకు సంబంధించి రక్తం నిల్వల కొరత తీవ్రంగా ఉంటుంది. పాజిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం మాత్రం కొంత మేర నిల్వ ఉంటుంది. సంగారెడ్డిలోని బ్లడ్ బ్యాంక్ నుంచి నెలకు సుమారు 300 యూనిట్ల రక్తాన్ని ఇతరులకు ఎక్కించేందుకు బాధితులు తీసుకెళ్తుంటారు. సాధారణంగా 150 నుంచి 200 యూనిట్ల వరకు నిల్వలు అందుబాటులో ఉండేవి. అయితే ప్రస్తుతం ఇక్కడ 58 యూనిట్ల రక్త నిల్వలే ఉన్నాయి. అందులో ఏ పాజిటివ్-24, బీ పాజిటివ్-5, ఏబీ పాజిటివ్-2, ఏబీ నెగిటివ్-1, ఓ పాజిటివ్-25, ఓ నెగిటివ్-1 యూనిట్లుండగా, ఏ-నెగిటివ్, బీ-నెగిటివ్ గ్రూప్ రక్త నిల్వలు అసలే లేవు.

ఏ, బీ-నెగిటివ్ గ్రూప్ రక్త నిల్వలు అసలే లేవు

ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లకు..

సంగారెడ్డిలోని జీజీహెచ్ 450 పడకల ఆస్పత్రిలో నిత్యం 25-35 వరకు శస్త్ర చికిత్సలు, కాన్పులు అవుతుంటాయి. ప్రసవాల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రసవానికి వచ్చే వారితో పాటు, రక్తహీనత, రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణంగా రక్తం అవసరం ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే వారికి ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నారు. కొరత తీవ్రంగా ఉంటే రోగి బంధువుల్లో ఎవరైనా ఒకరు డోనర్‌గా రక్తం దానం చేస్తే ఉచితంగా ఇస్తున్నారు. అయితే, బ్లడ్ బ్యాంక్‌లో పలు గ్రూపులకు చెందిన రక్తం అందుబాటులో ఉండకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ రక్తం అవసరమైన వారికి మాత్రం ప్యాకెట్‌కు రూ.1100 తీసుకుని రక్తం ఇచ్చే నిబంధన అమలులో ఉన్నది.

జిల్లా యంత్రాంగం చొరవ చూపితేనే..

ఆపదలో ప్రాణాలు కాపాడేది రక్తం. అలాంటి రక్తాన్ని సేకరించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విఫలమవుతున్నాయి. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి అంటూ ప్రకటనలు చేసే అనేక మంది వాటిని ఆచరించడంలో వెనుకంజ వేస్తున్నారు. వేసవి కాలంలో మరీ రక్తం ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఈ కాలంలో రక్తం అవసరమైన వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉంటే రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు ఇటు జిల్లా యంత్రాంగం, అటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పెద్దగా చొరవ చూపడం లేదు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చైతన్య కార్యక్రమాల నిర్వహించడం లేదు. ఫలితంగా రక్త నిధి కేంద్రాల్లో రక్త నిల్వల కొరత ఏర్పడుతున్నది. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహనీయుల జయంతులు, రాజకీయ నాయకుల జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా అరకొరగా రక్త నిల్వలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ క్రమంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేయడంతో పాటు విస్తృతంగా శిబిరాలు నిర్వహిస్తేనే ప్రయోజనం ఉంటుంది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం, ఆరోగ్య శాఖ చొరవ చూపితే పరిస్థితి నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదు. రక్తదానంపై అపోహలు వీడి దానం చేసేందుకు ముందుకు రావాలి. ఉదారంగా స్పందిస్తేనే బాధితులకు అవసరమయ్యే రక్త నిల్వలు అందుబాటులోకి వస్తాయి. యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు విరివిగా రక్తదానం చేసేందుకు చొరవ చూపాలి. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ఇబ్బందుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడినట్లవుతుంది. రక్త నిల్వల కొరత ఏర్పడకుండా దాతలను సమీకరించి పూర్తిస్థాయిలో కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ జి.అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, సంగారెడ్డి జీజీహెచ్



రక్తదానం చేస్తున్న దాత(ఫైల్)

జిన్నారం ఎంపీపీపై రేపు అవిశ్వాస సమావేశం

- సమానంగా ఇరుపక్షాల బలాలు
- సర్వత్రా ఉత్కంఠ

జిన్నారం, మార్చి 31: జిన్నారం మండల పరిషత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస సమావేశం ఏప్రిల్ 2న జరుగనున్నది. ఈ మేరకు ఆదివారం మండల పరిషత్ కార్యలయ అధికారులు మండలంలోని 8 మంది ఎంపీటీసీలకు నోటీసులు పంపిణీ చేశారు. గతంలో కోర్టు స్టేతో అవిశ్వాస సమావేశం వాయిదా పడగా, స్టే తొలగిపోవటంతో నిర్వహించనున్నారు.

సొంత గూటికి కాంగ్రెస్ ఎంపీటీసీ

ఫిబ్రవరి 2న బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస్వాన్ని ప్రతిపాదించి ఆర్డీవోకు అందజేశారు. అదే నెల 26న అవిశ్వాసం జరగాల్సి ఉండగా ఎంపీపీ కోర్టును ఆశ్రయించగా స్టే ఇవ్వటంతో ఆగిపోయింది. అనంతరం హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా అవిశ్వాసాలపై ఉన్న స్టేలను తొలగించటంతో మరోమారు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఎత్తుకు పైఎత్తులు ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు ఇటీవల ఆంధ్రప్రదేశ్, గోవాలో 15 రోజుల పాటు విహారయాత్రలకు వెళ్లారు. వీరు ఇటీవల తిరిగి రాగా అవిశ్వాసానికి రెండు రోజుల ముంగిట ఆదివారం ఊట్ల ఎంపీటీసీ గంగు రమేష్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా అవిశ్వాసం ప్రతిపాదించిన సభ్యుడిగా ఉండి క్యాంపునకు వెళ్లారు. అనూహ్యంగా తిరిగి కాంగ్రెస్‌లో చేరటంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు కంగుతిన్నారు. దీంతో మొత్తం 8 మంది ఎంపీటీసీలకు ప్రస్తుతం కాంగ్రెస్ నలుగురు, బీఆర్ఎస్‌కు కూడా నలుగురు ఉన్నారు. సమాన బలం ఉండడంతో ఏప్రిల్ 2న జరిగే అవిశ్వాసంపై సర్వాత్రా ఉత్కంఠ నెలకొన్నది.



కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఊట్ల ఎంపీటీసీ గంగు రమేష్

తూప్రాన్ టోల్‌ప్లాజా ధరలు యథాతథం

తూప్రాన్, మార్చి 31: భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 2024-25 సంవత్సరానికిగానూ హైవే రోడ్లపై టోల్‌ప్లాజాల్లో టోల్ రుసుం పెంపును నిలిపివేసింది. ప్రతీయేటా ఐదు నుంచి పది శాతం పెంచుతుండగా, ఈయేడాది కూడా పెంపుపై నిర్ణయం తీసుకున్నప్పటికీ నిలుపుదల చేశారు. గత యేడాది 44వ జాతీయ రహదారిపై బోయిన్‌పల్లి (హైదరాబాద్) నుంచి మెదక్ జిల్లా కాళ్లకల్ వరకు 27 కిలోమీటర్ల పొడవు ఆరులేన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున పెంపును తగ్గించారు. ఈయేడాది పెంచడం లేదు. ప్రతీ యేడాది మార్చి 31న అర్ధరాత్రి (ఏప్రిల్ ఒకటి) నుంచి అమలు చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తారు. ఈసారి టోల్ రుసుం పెంచేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, ఎన్‌హెచ్ఏఐ పరిధిలో అమలు చేయొద్దంటూ ఆదివారం అధికారులు మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో మెదక్, కామారెడ్డి జిల్లాలలో 44వ జాతీయ రహదారిపై ఉన్న మనోహరాబాద్ (తూప్రాన్), బిక్నూర్‌లో టోల్‌ప్లాజాలలో రేట్ల పెంపును నిలిపివేశారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినందున ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున టోల్ రుసుం పెంచడం లేదని సమాచారం. ఎప్పటి నుంచి రేట్ల పెంపు అమలులోకి వస్తుందనే విషయంపై ఎన్‌హెచ్ఐఏ అధికారులు స్పష్టతనివ్వలేదు.

ఏ తల్లి కన్నబిడ్డో..

- రోడ్డు పక్కన పొదల్లో చీమలు పట్టిన స్థితిలో నవజాత శిశువు
- సురక్షితంగా ఆసుపత్రికి చేర్చిన పోలీసులు
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హృదయవిదారక ఘటన



పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలో శిశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు, మార్చి 31: ఏమైందో ఏమో కాని అప్పుడే పుట్టిన ఆడబిడ్డను గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన పొదల్లో పడేసి వెళ్లిపోయారు. ఒళ్లంతా చీమలతో ఎండకు తాళలేక గుక్కపట్టి ఏడుస్తున్న ఆ చిట్టితల్లిని పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో ఉంచారు. ఈ హృదయ విదారక ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఆదివారం జరిగింది. అమీన్‌పూర్ లాలా బాయి కాలనీ నుంచి బొల్లారం వైపు వెళ్లే దారిలో ఓ శిశువు గుక్కపట్టి ఏడుస్తున్న శబ్దం విని విక్కీవర్మ అనే యువకుడు పోలీసులకు సమాచారమిచ్చాడు. అంబులెన్స్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఒళ్లంతా చీమలు పట్టి ఎండకు తాళలేక ఏడుస్తున్న శిశువును భద్రంగా పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆస్పత్రిలోని హైరిస్క్ సెంటర్‌లో శిశువుకు చికిత్సలు నిర్వహించారు. శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉందని చెప్పారు. అనంతరం సంగారెడ్డి ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో ఉంచేందుకు తరలించారు. ఆడపిల్ల కావడంతోనే పడేసి ఉంటారని భావిస్తున్నారు. శిశువును పడేసిన వారిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.





దుర్గాభవానీ క్షేత్రంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు, దీపాల వెలుగులో ఆలయం

దేదీప్యమానం

దీప కాంతులతో సంగారెడ్డి దుర్గాభవానీ క్షేత్రం

సంగారెడ్డి రూరల్, మార్చి 31 : సంగారెడ్డి మండలం ఈశ్వరాపురం (ఇస్మాయిల్‌ఖాన్‌పేట) గ్రామంలోని సప్తప్రాకారయుత దుర్గాభవానీ క్షేత్రం 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన లక్ష దీపోత్సవంతో ఆలయం వెలుగులతో విరాజిల్లింది. ధర్మాధికారి రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో విశేష పూజలను భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పంటలకు నీరందించి మానవత్వం చాటుకోవాలి

● ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట, మార్చి 31: కోతకు వచ్చిన పంటలను కాపాడేందుకు చెరువు నుంచి నీళ్ల విడుదల చేసేందుకు శాలిపేట గ్రామస్థులు సహకరించి మానవత్వం చాటుకోవాలని ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట నల్లచెరువు నుంచి నీళ్లను విడుదల చేసేందుకు చెన్నాయిపల్లి గ్రామ రైతులు కోరడంతో శాలిపేట గ్రామవాసులు నిరాకరించారు. దీంతో సంబంధిత అధికారులు గ్రామస్థులను సమన్వయం చేసి నీళ్లను విడుదల చేసేందుకు కృషిచేసినా ఫలితం దక్కలేదు. దీంతో అధికారులు వెనుదిరిగిన సంఘటన విధితమే. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలోని సీఐ వెంకటేష్, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణగౌడ్, ఇరు గ్రామాల పెద్దలను సమన్వయ పరిచేందుకు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరి కోతదశకు రావడంతో ఎండిపోతున్నాయని చెన్నాయిపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, నల్లచెరువు నుంచి రెండు, మూడురోజులు నీళ్లను విడుదల చేసి పంట పొలాలను పారిస్తే పంట చేతికొస్తుందని అన్నారు. ఇరు గ్రామాల రైతులు అర్థం చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో శాలిపేట గ్రామ ప్రజలు విముఖత చూపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఆర్ఐ గోవింద్, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు. ఇరుగ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వైభవంగా సీతారాముల కల్యాణం

తొగుట, మార్చి 31: మండల కేంద్రమైన తొగుటలో సీతారామాంజనేయస్వామి ఆలయ పంచదశ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ పరిసరాలు రామనామస్మరణతో దద్దరిల్లాయి. ఉదయం పుణ్యహవాచనం, గణపతి పూజ, ఆంజనేయస్వామికి అభిషేకం, నవగ్రహస్థాపన పూజ తదితర కార్యక్రవలు జరిగాయి. ఈ కల్యాణం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ, అఖిల భారత హన్‌మాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీల పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వారు భక్తులకు ఉపదేశమిచ్చారు. సీతారాముల కల్యాణానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సాధనతోనే సంగీత పరిజ్ఞానం

● ప్రముఖ బాలీవుడ్ నేపథ్య గాయని అనన్యభాస్కర్

పటాన్‌చెరు, మార్చి 31: క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధనతోనే సంగీత పరిజ్ఞానం లభిస్తుందని ప్రముఖ బాలీవుడ్ నేపథ్య గాయని అనన్యభాస్కర్ అన్నారు. ప్రముఖ సంగీత శిక్షణ సంస్థ మ్యూజికల్ అకాడమీ హైదరాబాద్‌లోని 8వ బ్రాంచ్‌ను బీరంగూడలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచి స్వర జ్ఞానం, సంగీత వాయిద్యాలపై శిక్షణ అందించాలన్నారు. సంగీత స్వర జ్ఞానాన్ని పెంపొందించడంలో మ్యూజికల్ అకాడమీ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మ్యుజిగల్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్.లక్ష్మీనారాయణ మాట్లాడారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామావళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదే స్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

పంచాంగ కర్త రాఘవేంద్రచార్యులుకు
సిద్ధాంతశిరోమణి బిరుదు ప్రదానం



కార్యక్రమంలో నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ప్రతినిధులు

సంగారెడ్డి రూరల్, మార్చి 31: నాలుగు దశాబ్దాలుగా పంచాంగ గణనం చేస్తూ యువ సిద్ధాంతులకు మార్గదర్శకంగా నిలిచిన బోరుపట్ల రాఘవేంద్రచార్యులుకు సిద్ధాంత శిరోమణి బిరుదు ప్రదానం చేశారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని దుర్గామాత మహాక్షేత్రంలో ఆదివారం బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సురేష్ జోషి చేతుల మీదుగా బిరుదును అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌జోషి మాట్లాడుతూ.. డిప్యూటీ కలెక్టర్‌గా రిటైర్ అయిన రాఘవేంద్రచార్యులు పంచాంగకర్తగా ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ఇతరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా సిద్ధాంత శిరోమణి బిరుదును ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. అనంతరం బోరుపట్ల భాస్కరాచారి రచించిన నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పురాణ వాచస్పతి పురాణం మహేశ్వర శర్మ, దుర్గాభవానీ మహాక్షేత్రం ధర్మాధికారి రాధాకృష్ణమూర్తి, బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సురేష్‌జోషి, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డా. విఠలేశ్వర శర్మ, కోశాధికారి సంతోష్‌శర్మ, సూర్యనారాయణశర్మ, మహిళా కార్యవర్గాల అధ్యక్షురాలు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీడిపల్లిలో 8వ వారం 'స్వచ్ఛ భారత్'

మనోహరాబాద్, మార్చి 31: మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఆదివారం 8వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిపల్లి గ్రామంలోని మహంకాళీ ఆలయం వద్ద యువకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లతో ఊడుస్తూ పేరుకుపోయిన చెత్తను తొలగించారు ప్రతీ వారం నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి రాక్ చర్చిలో ఏసు చరిత్రను బోధిస్తున్న పాస్టర్ ఏసుపాల్



కోహీర్: బిలాల్‌పూర్‌లో ఈస్టర్ గుట్ట వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



మునిపల్లి: మల్లికార్జునపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

సంగారెడ్డి రూరల్, మార్చి 31: సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని రాక్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చర్చి పాస్టర్ ఏసుపాల్ క్రీస్తు జీవిత చరిత్రను బోధించారు. మానవుల పాపాలను కడిగివేసేందుకే ఏసుక్రీస్తు శిక్షను అనుభవించారని వివరించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కిరణ్మయి, రవికుమార్, అరుణ్‌కుమార్, మహేష్ పీటర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డిలోని మెథాడిస్ట్ చర్చిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి పాస్టర్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను, బీఆర్ఎస్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, వెంకటేశ్వర్లు, కాసాల బుచ్చిరెడ్డి, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని మెథడిస్ట్ చర్చి ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు, పాస్టర్లు

● **కోహీర్:** మండల కేంద్రంతో పాటు బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, కవేలి, గురుజువాడ, రాజనెల్లి, మద్రి, పీచేర్యాగడి, సజ్జాపూర్, బడంపేట, పర్శపల్లి, గొడిగర్‌పల్లి, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, చింతలగట్టు తదితర గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో గల ఈస్టర్ గుట్టల వద్ద ఆదివారం తెల్లవారుజామునే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే క్రీస్తు కీర్తనలు పాడుతూ భక్తిశ్రద్ధలతో ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దిగ్వాల్ గ్రామంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో కోహీర్ మండల జడ్పీటీసీ రాందాస్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **మునిపల్లి:** మండల కేంద్రమైన మునిపల్లితో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చర్చిల్లో తెల్లవారు జాము నుంచే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **మాసాయిపేట:** మండలంలోని పలు గ్రామాల చర్చిలలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి, అచ్చంపేట, మాసాయిపేట, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఉదయం నుంచే చర్చిలలో ప్రార్థనలు చేశారు.

● **కొల్చారం:** కొల్చారం మండల వ్యాప్తంగా ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కొల్చారం, రంగంపేట, చిన్నఘనపూర్, ఎనగండ్ల, పోతంశెట్‌పల్లి, వరిగుంతం గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ, ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు బంధు మిత్రులతో కలిసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న 70కిలోల గంజాయి పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులు

జహీరాబాద్, మార్చి 31: జహీరాబాద్ మీదుగా కర్ణాటక, మహారాష్ట్రకు కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.11.20 లక్షల విలువచేసే 70 కిలోల ఎండు గంజాయితో పాటు నలుగురిని శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు చంద్రశేఖర్, భరత్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మోయిన్(మల్‌చెల్మ), మహ్మద్‌ఖాజా(జహీరాబాద్), శ్రీనివాస్(మిన్పూర్), మహ్మద్ ఇస్మాయిల్(జహీరాబాద్), నవాజుద్దీన్(రాంనగర్, జహీరాబాద్) కలిసి ముఠాగా ఏర్పడి జహీరాబాద్, నారాయణఖేడ్ కేంద్రాలుగా ఏర్పరుచుని ఆంధ్రప్రదేశ్‌లోని ఒడిస్సా బార్డర్ నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి హైదరాబాద్‌లోని ధూల్‌పేట, నానక్‌రాంగూడ, బీదర్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు పట్టణంలోని శివాలయం వద్ద శనివారం రాత్రి మాటు వేసి వాహనాలను తనిఖీలు చేపట్టగా కారులో గంజాయిని తరలిస్తున్న ముఠా సభ్యులు పట్టుబడ్డారని తెలిపారు. కారు, గంజాయితో పాటు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. మరో వ్యక్తి నవాజుద్దీన్(రానంగర్, జహీరాబాద్) పరారీలో ఉన్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవకాశం

● యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కేపీ రావు



రాతిపై చిత్రాలను పరిశీలిస్తున్న కేపీ రావు

వెల్దుర్తి, మార్చి 31: వెల్దుర్తి మండల పరిధి హస్తాల్‌పూర్ గ్రామంలోని రాతి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, పక్కన ఉన్న స్థలం, రాతి గుట్ట, ఆహ్లాదకర వాతావరణం ఎంతో బాగున్నదని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవకాశాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కేపీ రావు అన్నారు. ఆదివారం యోగివేమన యూనివర్సిటీ కడప పరిశోధక విద్యార్థి ప్రవీణ్‌రాజ్‌తో కలిసి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాన్ని ప్రొఫెసర్ కేపీ.రావు పరిశీలించి మాట్లాడారు. నాలుగువేల ఏళ్ల క్రితం తామ్ర శిలాయుగంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న రాతికి మనుషుల బొమ్మలు, జంతువుల బొమ్మలు, సూర్యుడు, చంద్రుడు, నృత్యాలు చేసిన చిత్రాలు రాతిపై చిత్రీకరించబడ్డాయని తెలిపారు. వాటిని ఫొటో తీసి కంప్యూటర్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా చిత్రాలను పరిశోధిస్తామని పేర్కొన్నారు.

జయప్రకాష్‌కు అయ్యప్ప సేవారత్న అవార్డు

సంగారెడ్డి రూరల్, మార్చి 31: సంగారెడ్డి పట్టణానికి చెందిన గురుస్వామి జయప్రకాష్‌కు అయ్యప్ప సేవారత్న అవార్డు వరించింది. హైదరాబాద్‌లో తెలంగాణ ఐక్యవైదిక ప్రతినిధులు ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతిస్వామి చేతుల మీదుగా గురుస్వామి జయప్రకాష్‌కు అవార్డును ప్రదానం చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఎన్నిక

సంగారెడ్డి రూరల్, మార్చి 31: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 6వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజేష్, కార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షులుగా వాణి, శ్రీనివాస్, నేహారెడ్డి, సహాయ కార్యదర్శులుగా పవన్, హరీశ్, సాక్షి, కమిటీ సభ్యులుగా విష్ణు, ప్రశాంత్, వైశాలి, రవి, కిరణ్‌గౌడ్, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, స్వప్న, విక్టోరియాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, మహేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకుల ప్రచారం

జిన్నారం, మార్చి 31: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ హయాంలో సాధించిన అభివృద్ధి, పథకాలపై పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆదివారం సోలక్‌పల్లి, అందూరు గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్ రావు, రాజిరెడ్డి, కృష్ణంరాజు, వెంకటేశం, సాయి, నవీన్, అశోక్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రక్తదానం జీవన దానమే

రామచంద్రాపురం, మార్చి 31: రక్తదానాన్ని ప్రోత్సహించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని 112వ డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. మయూరినగర్ కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఆదర్శ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజుగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చేగుంట: ఆత్మీయ సమ్మేళనంలో నర్సింగ్ మహర్షి దయానంద గురుకులపాఠశాల పూర్వ విద్యార్థులు

చేగుంట, మార్చి 31: దాదాపు పాతికేళ్ల తర్వాత స్థానిక వనం రిసార్ట్స్‌లో పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. నర్సింగ్ మహర్షి దయానంద గురుకుల పాఠశాల ఎస్సెస్సీ 1998-99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. వేర్వేరు వృత్తుల్లో స్థిరపడి దీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆప్యాయంగా పలకరించుకుని పరస్పర క్షేమ సమాచారాలను పంచుకున్నారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు.

జిన్నారంలో...

జిన్నారం, మార్చి 31: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన తాము దాదాపు 30 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకోవడం సంతోషంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జ్ఞాపికలను ప్రదానం చేశారు.



జిన్నారం ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎన్నికల్లో విజయం మనదే కావాలి



కందిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, మార్చి 31 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మనదే కావాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కంది పరిధిలోని ఓ ఫంక్షన్‌హాలులో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార వ్యూహంపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన ఎంపీ అభ్యర్థి వెంటరామిరెడ్డి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నియోజకవర్గంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని చింతా ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, ఎంపీపీ కల్వ సరళ పుల్లారెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

● మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్



కాట శ్రీనివాస్‌గౌడ్ తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, మార్చి 31: అన్నివర్గాల మద్దతు తనకే ఉన్నదని, ఈ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్‌లో నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులను కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ తల్లి భారతమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా ఒకవైపు నీలం మధును కాట శ్రీనివాస్‌గౌడ్ వ్యతిరేకిస్తుండగా ఆయన తల్లి భారతమ్మ నీలం మధుముదిరాజ్‌ను ఆశీర్వదించడం చర్చనీయాంశమైంది. ముందుగా కాట శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసేందుకు ఆయన నివాసానికి మధు మరికొంతమంది కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో పక్కనే ఉంటున్న ఆయన తల్లి భారతమ్మను కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అమీన్‌పూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు శశికళాయాదవరెడ్డి, ఆమె కుమారుడు కౌన్సిలర్ అనిరుధ్‌రెడ్డిలను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా శశికళాయాదవరెడ్డి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. నీలం గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు మల్లేష్, అనిరుధ్‌రెడ్డి, సామయ్య, నారాయణ రెడ్డి, రవీందర్, వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

కంది, మార్చి 31: కంది మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మతల్లి జాతరను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో పోతరాజుల విన్యాసాల నడుమ బోనాలు ఊరేగించారు. ఒగ్గు కళాకారులు ఎల్లమ్మతల్లి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ జాతరలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

చౌట్లపల్లిలో పెద్దిరాజు, పెద్దమ్మ కల్యాణం

హవేళిఘణపూర్, మార్చి 31: మండలంలోని చౌట్లపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ వార్షికోత్సవంతో భాగంగా ఆదివారం పెద్దిరాజు, పెద్దమ్మ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎదుర్కోలు ఘట్టం అట్టహాసంగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీశంకర్, కమిటీ సభ్యులు నర్సింహులు, సంతోష్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం, మార్చి 31: జీహెచ్ఎంసీ 112వ డివిజన్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మలన్న జాతరలో భాగంగా, కార్పొరేటర్ పుష్పనగేష్ గంపలెదుర్కొని ఊరేగింపుతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తొంట అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుక్మాపూర్‌లో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చేగుంట, మార్చి 31: చేగుంట మండలం రుక్మాపూర్‌లో వనదుర్గా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆదివారం స్థాపిత దేవత హోమం, ధాన్యాది వాసం, శయ్యాదివాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, దేవత పూజ భజనలు నిర్వహించారు.

నల్లపోచమ్మకు పాచి బండ్ల ప్రదర్శన

కౌడిపల్లి, మార్చి 31: తునికి నల్లపోచమ్మ జాతర చివరి రోజు ఆదివారం సందర్భంగా భక్తులు ఆలయానికి పోటెత్తారు. అమ్మవారిని పురోహితులు ప్రత్యేకంగా అలకరించారు. అమ్మవారికి భక్తులు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి హాజరై అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

చాముండేశ్వరి ఆలయంలో భక్తుల సందడి

చిలప్‌చెడ్, మార్చి 31: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవుదినం కావడంతో హైదరాబాద్, మెదక్, బీదర్ తదితర సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు పూజారులు ప్రభాకరశర్మ, మోతీలాల్ శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి : బీబీ పాటిల్



కోహీర్: బీజేపీలో చేరిన వారితో ఎంపీ బీబీ పాటిల్

కోహీర్ మార్చి 31: బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోహీర్‌లోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో పలువురు బీజేపీలో చేరగా బీబీపాటిల్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సారథ్యంలో బీజేపీ పార్టీతోనే దేశం మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో రహమత్, విద్యాసాగర్, రమేష్‌తో పాటు 100 మంది నాయుకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, బీజేపీ నాయకులు ఉమాకాంత్ పాటిల్, ఢిల్లీ వసంత్, గోవర్ధన్‌రెడ్డి, నౌబాద్ జగన్, కిష్టయ్య, అంజనేయులు తదితరులు ఉన్నారు.

● **జహీరాబాద్:** మండలంలోని అల్గోల్, ఆనెగుంట గ్రామాల్లో, పట్టణంలోని లింగాయత్‌సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బీజేపీలో చేరగా, వారందరికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

● **మునిపల్లి:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలోకి తీసుకెళ్లాలని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పార్టీ శ్రేణులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని బుదేరా చౌరస్తాలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతోనే పార్టీలోకి వలసలు

నర్సాపూర్, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు చూసే బీఆర్ఎస్ నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లిఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న కాలంలో మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారుతుందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరుతారన్నారు.

'ఎన్ఎస్ఎస్' సామాజిక దృక్పథాన్ని పెంపొందిస్తుంది

సంగారెడ్డి అర్బన్, మార్చి 31 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని కలబ్‌గూర్, చింతలపల్లి, అంగడిపేట గ్రామాల్లో శ్రమదానం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ఆంగ్ల అధ్యాపకులు విశ్వేశ్వరశర్మ మాట్లాడుతూ శీతాకాల శిబిరాలు సామాజిక పౌరులుగా ఎదుగేందుకు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.జగదీశ్వర్, వెంకటేశం, పద్మజ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 30 పోలీసు యాక్టు అమలు

సంగారెడ్డి క్రైం, మార్చి 31: ఏప్రిల్ 1నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆందోళనా కార్యక్రమాలు చేయరాదని సూచించారు. ఒకవేళ అనుమతి లేకుండా ఎవరైనా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు.

జిల్లాలోని పరిశ్రమలను సందర్శించండి

● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన బీఎంఎస్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 31: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన రామచంద్రను హైదరాబాద్‌లో బీఎంఎస్ జిల్లా నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఎంఆర్ఎఫ్, ఓడీఎఫ్, బీహెచ్ఈఎల్, బీడీఎల్, మహీంద్ర తదితర పరిశ్రమలను సందర్శించాలని ఆయనను బీఎంఎస్ నాయకులు కోరారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సందర్శిస్తానని, కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీంద్రనాథ్‌వర్మ, ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంఆర్ఎఫ్ అంకెనపల్లి యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెపా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా వెంకటరవీందర్

పెద్దశంకరంపేట, మార్చి 31: ఇటీవల హైదరాబాద్‌లోని మెపా కేంద్రకార్యాలయంలో జరిగిన మెపా(ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ)రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరుకు చెందిన కరణం వెంకటరవీందర్ ముదిరాజ్‌ను మెపా తెలంగాణ సంగారెడ్డిజిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు.

ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?

● సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు

నిజాంపేట, మార్చి 31: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ సారథ్యంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, నేడు కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి ఆమడదూరంలో ఉన్నదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పద్మక్క స్వల్ప మెజారిటీతో ఓటమి పాలవడం బాధాకరమని, ఓటమికి ఎంపీగా గెలిపించి ప్రతీకారం తీర్చుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ స్థానాలు గెలిస్తే అసెంబ్లీలో గళం విప్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణలో బీజేపీ చేసిందేమీ లేదని, రఘునందన్‌రావును మెదక్ ప్రజలు నమ్మరని గెలిచేది బీఆర్ఎస్ అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి పీ.వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిజాంపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పేదలకు సేవచేస్తా: వెంకట్రామారెడ్డి

రామాయంపేట/కౌడిపల్లి, మార్చి 31: 'మీరు నన్ను నమ్మండి. ఆపై ఓటర్లకు నమ్మకం కల్పించండి. ఈ 40 రోజులూ నాకోసం మీరు పనిచేస్తే.. 1,825 రోజులు మీ వెన్నంటి ఉంటా. రూ.100 కోట్లతో సొంత నిధి ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఫీజులు కడుతా. ఈ మాట తప్పితే నా తలకాయ కోసుకుంటా' అని బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటరీ అభ్యర్థి పి. వెంకట్రామారెడ్డి భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. రామాయంపేటలో ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో గెలిచిన 9 మాసాల్లో రూ.14 కోట్లతో ఫంక్షన్‌హాల్స్ నిర్మిస్తానన్నారు. 25 ఏళ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా పరిపాలన అందించిన వ్యక్తిని నేను. నా పనితనాన్ని గుర్తించి అప్పటి సీఎం కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించి ఎమ్మెల్సీని చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, శారద, ఎంపీపీ, భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పాల్గొన్నారు. కౌడిపల్లి మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను గెలిపిస్తే అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడుతూ వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, కొల్చారం జడ్పీటీసీ మేఘమాలసంతోష్‌కుమార్, బురుగడ్డ మాజీ సర్పంచ్ పెద్దోల నర్సింహులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 31: పట్టణంలోని ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ పార్టీ తరపున ఆదివారం ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేశారు. స్థానిక న్యూ భారత్ ఫంక్షన్ హాలులో సాయంత్రం జరిగిన ఇఫ్తార్‌లో ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డిలు పాల్గొన్నారు.

ఓడారంటూ హేళన చేస్తారా..?

● 2004లో మీ అమ్మ నా చేతిలో ఓడలేదా?

● ఎమ్మెల్యే రోహిత్‌పై మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఫైర్



రామాయంపేటలో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, మార్చి 31: 'ఎన్నికల్లో గెలుపోటములు సహజం. అంతమాత్రాన ఓడిన వారిపై అదేపనిగా అవహేళన చేస్తారా... 2004లోనూ మీ అమ్మ నా చేతిలో ఓటమి పాలైన విషయం నీకు తెలుసా.. అప్పుడు నేను నీలాగే మాటిమాటికీ హేళన చేశానా' అంటూ మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రావును ప్రశ్నించారు. ఆదివారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం రామాయంపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ప్రజాప్రతినిధిగా గెలిచిన వ్యక్తి ఎన్నికలు ముగిసిన పిదప అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలంటూ హితవు పలికారు. కానీ ఆ విషయం మరిచి మాటిమాటికీ తనను ఓడిపోయావంటూ వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో వైఫల్యం చెందాను. అది కూడా మా ఏమరపాటుయే కారణం.. అతి నమ్మకం వల్లే ఓడామంటూ చెప్పుకొచ్చారు.